## • ఎక్కడపడితే అక్కడే!

మార్కెట్ రోడ్డు మధ్యలోనే పేరుకుపోతున్న చెత్త



నిత్యం వేలాది మంది తిరిగే కరీంనగర్ మార్కెట్ రోడ్డు చెత్తమయంగా మారింది. కూరగాయల వ్యర్థాలు, కవర్లు, ఇతర చెత్తంతా నడి రోడ్డుపైనే పడేస్తుండడంతో ఇలా కుప్పలు కుప్పలుగా పేరుకుపోతున్నది. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడాల్సి వస్తున్నది.

-కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



## అరెస్టుకు భయపడేది లేదు

ఈ కేసులు మాకు కొత్త కాదు. అరెస్టులకు భయపడేది లేదు. నాడు రాష్ట్ర ఏర్పాటు కోసం కొట్లాడిన సమయంలో బీఆర్ఎస్ శ్రేణులపై అనేక కేసులు పెట్టారు. వాటిని న్యాయస్థానం ద్వారా ఎదుర్కొన్నాం. ఇప్పుడు రైతులకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేస్తున్నాం. ఇప్పుడూ కేసులు పెడుతున్నారు. వీటికి ఏ బీఆర్ఎస్ నాయకుడు భయపడడు. న్యాయస్థానం మీద నమ్మకంతో ముందుకు సాగడమే మా లక్ష్యం. మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చే ప్రతి ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే ధ్యేయంగా ఆయా వర్గాలను కలుపుకొని ముందుకెళ్లి తీరుతాం.

- ఏనుగు రవీందర్ రెడ్డి, కరీంనగర్ గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్

# పోలీసుల అత్యుత్సాహం?



గురువారం రాత్రి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచేందుకు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డిని తీసుకొచ్చిన పోలీసులు

### బీఆర్ఎస్ నాయకులే లక్ష్యంగా పావులు

- అరెస్ట్ వ్యవహారంలో అడుగడుగునా తప్పులు
- ఖాకీల తీరును న్యాయమూర్తికి వివరించిన న్యాయవాది రవీందర్‌సింగ్
- రిమాండ్ తిరస్కరించిన మేజిస్ట్రేట్.. స్టేషన్ బెయిల్‌పై విడుదల
- అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామువరకా హైడ్రామా • అరెస్టు తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- భగ్గుమంటున్న గులాబీ శ్రేణులు • మరికొంత మందిపై కేసులు పెట్టేందుకు ప్రయత్నాలు?

రుణమాఫీ అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని బీఆర్ఎస్ ఎండగడుతున్న వేళ.. నాయకులను అణచివేసేందుకు పోలీసులు అత్యుత్సాహం చూపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గురువారం చొప్పదండిలో జరిగిన ఘటనే అందుకు నిదర్శనంగా నిలుస్తుండగా.. కేసు నమోదులో ఖాకీలు వ్యవహరించిన తీరుపై అనేక ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. మరోవైపు ఈ వ్యవహారంలో మేజిస్ట్రేట్ అక్షింతలు వేయడంతోపాటు ఏకంగా రిమాండ్‌ను తిరస్కరించి, స్టేషన్ బెయిల్‌కు ఆదేశాలు ఇవ్వడం పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ మేరకు స్టేషన్ బెయిల్‌పై నాయకులు విడుదల కాగా.. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము దాకా జరిగిన హైడ్రామాపై బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమంటున్నాయి. మొత్తం తొమ్మిది మందిపై కేసు పెట్టి, నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంకోవైపు మరికొంత మందిపై కేసుల నమోదుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తున్నది.

కరీంనగర్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) / రాంనగర్ : రుణమాఫీ కోసం రైతులు రణం సాగిస్తున్నారు. ఇప్పటికే రోడ్డెక్కడంతోపాటు ఆందోళనలతో హోరెత్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆది నుంచీ అన్నదాతలకు అండగా నిలుస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాఫీ కోసం గురువారం నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. ఆ మేరకు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో చొప్పదండిలో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసే సమయంలో పార్టీ నాయకులకు, పోలీసులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో సుంకె రవిశంకర్‌తో పాటు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, మరికొంత మంది నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య స్టేషన్‌లో ఉంచుకొని, ఆ తర్వాత వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు. ఈ సమయంలో అంతా సాఫీగా సాగడంతో నాయకులు తమ ఇండ్లకు వెళ్లిపోయారు.

#### సీన్ మారింది.. హైడ్రామా మొదలు

ధర్నాలు జరగడం.. అరెస్టులు చేయడం.. పోలీస్ స్టేషన్లకు తరలించడం, ఆ తర్వాత సొంత పూచీకత్తుపై వదిలిపెట్టడం సర్వసాధారణంగా జరిగేవి. ఇక్కడ కూడా అలానే జరిగిందని అందరూ భావించారు. కానీ, ఆ తర్వాత సీన్ మారింది. ధర్నా సమయంలో నాయకులు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించారని, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని పేర్కొంటూ ఆగమేఘాల మీద చొప్పదండి పోలీసుస్టేషన్‌లో మొత్తం తొమ్మిది మందిపై కేసులు పెట్టారు. అందులో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ గన్ను శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌తోపాటు కే మహేశ్, మున్సిపల్ కౌన్సిలర్, ఇతర బీఆర్ఎస్ నాయకులు పెద్దెల్లి అనిల్, మారం రాజు, మునిపాల తిరుపతి రావు, నరేశ్‌పై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నిజానికి పోలీసులు చెబుతున్నట్టు ధర్నా సమయంలో.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా, విధులకు ఆటంకం కలిగించినా సదరు నాయకులపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి. కానీ. ఇక్కడ అలా జరగలేదు. అదుపులోకి తీసుకున్న నాయకులను మధ్యాహ్నం 12 గంటల సమయంలో స్టేషన్ నుంచి వదిలిపెట్టారు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ, పోలీసులు సీన్‌మార్చి తమదైన కోణంలో హైడ్రామా మొదలు పెట్టారు. సాయంత్రం 4 గంటల సమయంలో స్టేషన్ ఎస్ఐ.. ముందుగా రవీందర్‌రెడ్డికి ఫోన్ చేసి నోటీసులు ఇవ్వాలని చెప్పగా, తాను కరీంనగర్‌లోని ఓ థియేటర్‌లో సినిమా చూస్తున్నట్టు చెప్పారు. ఏమైనా ముఖ్యమైన నోటీసులా? అని అడిగితే.. అవునంటూ ఎస్ఐ సమాధానమిచ్చారు. రవీందర్‌రెడ్డి సినిమా చూసి బయటకు వచ్చే వరకు, పలు స్టేషన్లకు సంబంధించి ఎస్ఐలతో పాటు టాస్క్‌ఫోర్సు పోలీసులు రెడీగా ఉండి అరెస్టు చేసి టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించారు. అరెస్ట్ విషయాన్ని రవీందర్‌రెడ్డి తన భార్యతో చెబుతున్న సమయంలో పోలీసులు ఫోన్ లాగేసుకున్నారు. రవీందర్ రెడ్డి భార్య ఈ విషయాన్ని బీఆర్ఎస్ నాయకుడు తిరుపతినాయక్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన బీఆర్ఎస్ అగ్ర నేతలకు సమాచారమిచ్చారు. ఇది ఇలా ఉంటే.. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెల్మ శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గన్ను శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌ను అరెస్టు చేసిన పోలీసులు, మిగిలిన వారిని పరారీలో ఉన్నట్టు చూపారు. అరెస్టు చేసిన నలుగురిని రిమాండ్ చేసేందుకు పోలీసులు చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టగా.. ఈ విషయంలో అత్యుత్సాహం చూపారన్న విమర్శలు వస్తున్నాయి. నిజానికి ఈ వ్యవహారంలో అర్ధరాత్రి సమయంలో రిమాండ్ కోసం మేజిస్ట్రేట్ ముందు పోలీసులు హాజరు పరుస్తున్న విషయం తెలుసుకున్న పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అండగా నిలిచారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విజ్ఞప్తి మేరకు న్యాయవాది సర్దార్ రవీందర్‌సింగ్ అర్ధరాత్రి తన వాదనలు వినిపించారు. రైతులకు సంబంధించి జరిగిన ధర్నా వ్యవహారంలో పోలీసులు ఇటువంటి కేసులు నమోదు చేయడం న్యాయ సమ్మతం కాదని, దీంతో పాటు అరెస్టు చేసిన వారికి ఎటువంటి సమాచారం ఇవ్వలేదని, ఇదంతా చూస్తే ఉద్దేశ పూర్వకంగా కేసులు నమోదు చేసినట్టు అర్థమవుతుందని పేర్కొన్నారు. అన్నింటినీ పరిశీలించిన న్యాయమూర్తి రిమాండ్‌ను తిరస్కరిస్తూ స్టేషన్ బెయిల్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో చొప్పదండి స్టేషన్‌లో పోలీసులు బెయిల్ ఇచ్చారు. సంబంధిత నాయకులు వారి వారి ఇండ్లకు చేరుకునే వరకు తెల్లవారుజామున 3 గంటలు అయిందని నాయకులు తెలిపారు.



గురువారం ధర్నా అనంతరం చొప్పదండి పోలీస్‌స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి

#### అడుగడుగునా తప్పులు?

నిజానికి ఆందోళన సమయంలో సదరు నాయకులు పోలీసులకు ఇబ్బందులు సృష్టించి ఉంటే.. మధ్యాహ్నం 11 నుంచి 12 గంటల మధ్యలో స్టేషన్‌లో ఉన్నప్పుడే కేసులు నమోదు చేయాలి. అక్కడే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలి. కానీ, ఇక్కడ పోలీసులు అవేవీ చేయలేదు. స్టేషన్‌లో ఉన్న నాయకులను మధ్యాహ్నం 12 గంటల తర్వాత వదిలిపెట్టారు. ఒక వేళ తప్పుచేసి ఉంటే ఎందుకు వదిలి పెడుతారన్న ప్రశ్నలకు సమాధానం లేదు. అంతేకాదు, పోలీసులు ముందుగా వదిలిపెట్టి, మళ్లీ కేసులు నమోదు చేసి ఎందుకు అరెస్టు చేశారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అంటే మొత్తంగా ఈ వ్యవహారాన్ని చూస్తే మధ్యలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు వచ్చాయా..? లేక ఎవరైనా పోలీసులే అత్యుత్సాహం చూపారా..? భవిష్యత్‌లో బీఆర్ఎస్ పార్టీ తరపున ఆందోళన కార్యక్రమాలు చేయడానికి ముందుకు రాకుండా భయభ్రాంతులకు గురిచేయాలన్న కుట్రలు అందులో ఉన్నాయా..? అన్న కోణంలో ప్రస్తుతం చర్చ జరుగుతున్నది. ఇవేకాదు ఎఫ్ఐఆర్‌లో రవీందర్‌రెడ్డి విషయంలో పేర్కొన్న పలు అంశాలను చూస్తే ఎలాగైనా సరే.. అతనితోపాటు మిగిలిన వారిని రిమాండ్‌కు పంపి తీరాలన్న ఉత్సాహం అందులో కనిపిస్తున్నదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ధర్నా సందర్భంగా పెట్టిన కేసు కంటే ఎక్కువగా రవీందర్‌రెడ్డిపై గతంలో ఉన్న కేసులను ఎఫ్ఐఆర్‌లో వివరిస్తూ వచ్చిన పోలీసుల తీరు దీనికి నిలువెత్తు నిదర్శనమన్న విమర్శలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా చొప్పదండి నియోజకవర్గంలో సోషల్ మీడియా వేదికగా పని చేస్తున్న మరికొంత మంది బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం అందుతున్నది.

## ఏసీబీ.. నాలుగు విభాగాలే టార్గెట్!



వేములవాడ రాజన్న ఆలయంలో రెండో రోజు రికార్డులను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు

- రాజన్న ఆలయంలో అక్రమాలపై రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదుల వెల్లువ
- రెండోరోజూ క్షుణ్ణంగా తనిఖీలు
- దేవాదాయ శాఖలో చర్చనీయాంశం

రాజన్న ఆలయంలో ఏసీబీ అధికారుల తనిఖీల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. స్వామివారికి ఆదాయాన్ని గడించే నాలుగు శాఖలే టార్గెట్‌గా చేసుకొని కొద్ది రోజులుగా వస్తున్న ఫిర్యాదుల ఆరోపణలతో సోదాలు చేడయం కలకలం రేపింది.

వేములవాడ, ఆగస్టు 23 : రాజన్న ఆలయంలోని కొద్ది రోజులుగా అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. ప్రధానంగా నాలుగు విభాగాలే టార్గెట్‌గా సోదాలు చేశారు. మొదటి రోజు 20 మంది అధికారులతో కూడిన బృందం దాదాపు 10గంటల పాటు తనిఖీలు చేయగా, రెండో రోజు శుక్రవారం పది మంది 12గంటలపాటు సోదాలు చేశారు. లీజుల టెండర్లు, నిత్యాన్నదానం సత్రం రికార్డులను పరిశీలించారు. ప్రధానంగా లడ్డూ ప్రసాదాల తయారీ విక్రయాలకు సంబంధించిన గోదాం నిల్వలు, లీజులు టెండర్లు, వసతి గదుల సముదాయాలు, నిత్యాన్నదానం సత్రంలోని అన్ని రికార్డులను పరిశీలించారు. తనిఖీలు చేసిన సమయంలో ప్రతి అంశాన్నీ ల్యాప్‌టాప్‌లలో పొందుపరిచారు. అయితే, అనుమానమున్న ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా పరిశీలించడమే కాకుండా, కొన్ని శాంపిళ్లను సేకరించారు.

#### దాడులతో కలకలం

రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో తిష్ట వేసి, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వం ఇటీవలే భారీ ఎత్తున ఉద్యోగ బదిలీలు చేపట్టింది. అయితే, వేములవాడ, యాదగిరిగుట్ట నుంచి అత్యధిక సంఖ్యలో ఉద్యోగులు బదిలీ అయ్యారు. అయినప్పటికీ విజిలెన్స్, ఇతర ఆరోపణలు ఉన్నవారు మాత్రం బదిలీ కాలేదు. ఈ నేపథ్యంలోనే ఫిర్యాదులు వెల్లువెత్తడం, మొదట విజిలెన్స్ అధికారులు ఆ తర్వాత ఏసీబీ దాడులు చేయడం కలకలం రేపుతున్నది. ఈ వ్యవహారంతో పేదల దేవుడు రాజన్నకు మచ్చ పడేనా? అనే ఆందోళన భక్తుల్లో కనిపిస్తుండగా, దాడులపై జోరుగా చర్చ సాగుతున్నది.



కొత్తగా రేకులు వేసిన మరుగుదొడ్లు ఇవే..

## మూతపడిన బడికి పూతలు

- నాలుగేండ్ల క్రితం మూతపడ్డ పోచంపల్లి పాఠశాల
- అయినా అమ్మ ఆదర్శ స్కీం కింద మరమ్మతులు • ఇదే తీరున కొత్తపల్లి బడికి పనులు
- మండిపడుతున్న తల్లిదండ్రులు
- కమీషన్ల కోసమే చేస్తున్నారనే ఆరోపణలు



పోచంపల్లి ప్రాథమిక పాఠశాల

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 23 : బిల్లుల కోసం పాత బడికి పూతలు పెడుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పథకం కింద పెద్దమొత్తంలో నిధులు మంజూరు కాగా, నాలుగేండ్ల క్రితం మూతపడిన స్కూల్‌కు మరమ్మతులు చేస్తున్నారు. పిల్లలు లేకున్నా పనులు చేయడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇదంతా కమీషన్ల కోసమే చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట పరిధిలోని పోచంపల్లి గ్రామం నుంచి కేవలం 14 మంది విద్యార్థులే ఉన్నారు. అందులో 12 మంది ప్రైవేట్ స్కూళ్లలో చేరారు. విద్యార్థులు అనుకున్న స్థాయిలో లేకపోవడంతో స్థానిక ప్రాథమిక పాఠశాలను నాలుగేళ్ల క్రితం మూసివేశారు. అందులో ఉన్న ఇద్దరు పిల్లలను పక్కనే మీర్జంపేట స్కూల్‌లో చేర్పించారు. అయితే ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పేరిట స్కూళ్ల మరమ్మతు చేపట్టింది. అందుకు మండలంలోని 38 స్కూళ్లకు ₹1.70 కోట్లు మంజూరు చేసింది. అందులో పోచంపల్లి స్కూల్‌కు 6.40 లక్షలు కేటాయించింది. దీంతో మూతపడిన పోచంపల్లి పాఠశాలను అభివృద్ధి చేస్తున్నారు. ఈ నిధులతో వంట గది, మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. కేవలం మరుగుదొడ్లకు పైకప్పు వేయించి, సుమారు ₹3లక్షల పైనే నిధులు డ్రా చేశారు. ఇదే గ్రామ పరిధిలో ఉన్న కొత్తపల్లి పాఠశాల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. ఇక్కడ విద్యార్థులు లేకపోవడంతో ఇక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయులను మీర్జంపేట పాఠశాలకు డిప్యుటేషన్ పై పంపించారు. ఈ మూతపడ్డ పాఠశాలకు ₹5.90లక్షలు మంజూరు కాగా, సగం వరకే పనులు పూర్తి చేశారు. అధికారులు కాసుల కోసం కక్కుర్తి పడి ఇలా మూతపడ్డ పాఠశాలలకు నిధులు మంజూరు చేయించి నామమాత్రపు పనులు చేయించి చేతులు దులుపుకున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించాలని, నిధులను దుర్వినియోగాన్ని అడ్డుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

#### నిధులు మంజూరయ్యాయి

పోచంపల్లి పాఠశాలలో మైనర్ రిపేర్ కోసం ₹6.40లక్షలు మంజూరయ్యాయి. వచ్చిన నిధులతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పనులు జరిగాయి. ₹3లక్షల 20వేలు డ్రా చేశాం. ఇంకా పనులు జరగాల్సి ఉంది. ఇక్కడ విద్యార్థులు లేకపోవడంతో మూడు సంవత్సరాల క్రితం మీర్జంపేట పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపించారు. అప్పటి నుంచి ఇక్కడే పని చేస్తున్నా.

- కే రాజమ్మ, ఉపాధ్యాయురాలు


## సౌదీలో వేర్‌హౌస్ అసోసియేట్ ఉద్యోగాలు

జగిత్యాల రూరల్, ఆగస్టు 23: గల్ఫ్ దేశం సౌదీ అరేబియాలో వేర్‌హౌస్ అసోసియేట్ ఉద్యోగాలు ఉన్నాయని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ బీసత్యమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టామ్‌కామ్ ఆధ్వర్యంలో ఆసక్తిగల యువత నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వెల్లడించారు. ఇంటర్మీడియెట్ చదివి, కంప్యూటర్ నాలెడ్జ్ కలిగి రెండేండ్ల అనుభవం, 22 నుంచి 30 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్నవారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాల కోసం www.tomcom.telangana.gov.in ను సంప్రదించాలని కోరారు. టామ్‌కామ్ ఆధ్వర్యంలో ఈ నెల 27 ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జగిత్యాలలో నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ పాస్‌పోర్ట్, ఆధార్‌కార్డ్, ఇంటర్ మెమో జిరాక్స్ కాపీలు పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు.

## నాటి మొక్కలు.. నేటి మానులు

- రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అకుంఠిత దీక్షా ఫలితం
- తొమ్మిది విడుతల్లో నాలుగు కోట్లకు పైగా నాటిన మొక్కలు
- 'హరితహారం'తో పెరిగిన పచ్చందాలు
- కరీంనగర్ జిల్లాలో 8 నుంచి 18.2 శాతానికి పెరుగుదల

తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన హరితహారంతో కరీంనగర్ జిల్లాలో క్రమేణా పచ్చదనం పెరిగింది. 2014 నుంచి ఏటా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి, నేడు మానులుగా మారాయి. రోడ్లకు ఇరువైపులా, చెరువు గట్లు, గ్రామాల్లోని ఖాళీ ప్రదేశాల్లో పెంచిన మొక్కలు ఎదిగివచ్చాయి. అన్నింటికన్నా మించి నాడు నామమాత్రంగానే ఉన్న అటవీ విస్తీర్ణం, నేడు చెప్పుకోదగ్గ స్థాయికి చేరింది.



చింతకుంట-మల్కాపూర్ బైపాస్ రోడ్డులో 4వ విడుత హరితహారంలో నాటిన మొక్కలు నేడు మానులుగా మారిన దృశ్యం

కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 23 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకువచ్చిన హరితహారం సత్ఫలితాలనిచ్చింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా కొనసాగించింది. ఏటా వానకాలం చిన్నపాటి వర్షాలు పడగానే.. మొక్కలు నాటించింది. అనంతరం సంరక్షణ చర్యలను అధికార యంత్రాంగం చూసుకునేది. దీంతో నాటిన మొక్కల్లో అత్యధిక శాతం వృక్షాలుగా మారాయి. కరీంనగర్ జిల్లాలో తొమ్మిది విడుతల్లో 4.2 కోట్ల పైచిలుకు మొక్కలు నాటగా, ప్రస్తుతం 3.5 కోట్లకుపైగా బతికి ఏపుగా పెరిగాయి. ఫలితంగా ఉమ్మడిపాలనలో 8శాతానికే పరిమితమైన పచ్చదనం తాజాగా, 18.2 శాతానికి చేరినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం హరితహారానికి పెద్దపీట వేయడంతో ప్రతి పంచాయతీలో నర్సరీలు ఏర్పాటు చేయడం, అందులో పెరిగిన మొక్కలను గ్రామాల్లోని ఖాళీప్రదేశాల నాటడం, ప్రతి ఇంటికీ పంపిణీ చేయడంతో మొక్కల పెంపకం మొదలైంది. ప్రజలు తమ ఇళ్లు, పెరళ్లలో పండ్లు, పూల మొక్కలు పెంచుకొనేలా ప్రోత్సహించడంతో పల్లెలు, పట్టణాలతోపాటు రహదారుల పక్కన ఆహ్లాదం వెల్లివిరుస్తున్నది.

## పోలీసులమని బెదిరించి..

- కోరుట్లలో సినీ ఫక్కీలో చోరీ
- వృద్ధుడి మెడలోంచి బంగారు గొలుసు, ఉంగరం లాక్కెల్లిన దుండగులు

కోరుట్ల, ఆగస్టు 23 : బైక్‌పై వచ్చిన ఇద్దరు తాము పోలీసులమని చెప్పి ఓ వృద్ధుడి మెడలోంచి బంగారు గొలుసు, ఉంగరం లాక్కెళ్లారు. వివరాల ప్రకారం.. మిట్టపల్లి భూమరాజం శుక్రవారం కూరగాయలు కొనేందుకు కోరుట్ల పట్టణంలోని ఇందిరారోడ్డు నుంచి తన ద్విచక్ర వాహనంపై మార్కెట్‌కు వెళ్తున్నాడు. అంతలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు భూమరాజంను అడ్డుకున్నారు. తాము పోలీసులమని, గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని, సంచిని తనిఖీ చేయాలని బెదిరించారు. పథకం ప్రకారం అప్పటికే అక్కడ ఉన్న ముఠాకు చెందిన మరో వ్యక్తి బ్యాగును చెక్ చేస్తున్నట్టు నటించారు. భూమరాజంను మాయమాటలతో నమ్మించారు. బలవంతంగా అతని మెడలో ఉన్న తులం బంగారు చైన్, అరతులం ఉంగరం లాక్కుని ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దొంగతనం చేసిన నిందితులు బైక్‌పై వెళ్తున్న దృశ్యాలు సీసీ టీవీ కెమెరాలో రికార్డు అయ్యాయని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. నిందితుల్లో హెల్మెట్ ధరించి బైక్ నడుపుతున్న వ్యక్తి తెలుపు రంగు ఫుల్ హ్యాండ్, వెనుక కూర్చున్న దుండగుడు గోధుమ రంగు షర్ట్‌పై నలుపు గీతలు ఉన్నది ధరించి ఉన్నాడని తెలిపారు.

## సౌదీలో యువకుడి నరకయాతన

- టీకా వికటించి ఇన్ఫెక్షన్ • ఇంటికి రప్పించాలని తల్లి వేడుకోలు
- విదేశాంగ శాఖ అధికారి పీవోఈకి ఫిర్యాదు



చంద్రశేఖర్

జగిత్యాల టౌన్, ఆగస్టు 23: హైదరాబాద్‌లోని ఒక గల్ఫ్ మెడికల్ సెంటర్‌లో వైద్య టీకా వేయించుకొని సౌదీకి వెళ్లిన ఓ యువకుడు టీకా వికటించి నరకయాతన అనుభవిస్తున్నాడు. బాధితుడి తల్లి లక్ష్మి విదేశాంగ శాఖకు ఫిర్యాదుతో గురువారం విషయం వెలుగుచూసింది. కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన పోతుగంటి చంద్రశేఖర్ జూన్ 24న హైదరాబాద్‌లోని గల్ఫ్ మెడికల్ సెంటర్‌లో వైద్య పరీక్షలతో పాటు టీకా వేయించుకున్నాడు. జూలై 11న జాబ్ వీసాపై సౌదీ అరేబియాలోని ఆల్-బాద్ తాబూక్‌కు ఫ్యామ్కో కంపెనీ నియోమ్ ప్రాజెక్ట్‌లో క్లీనింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేసేందుకు వెళ్లాడు. కొన్నిరోజుల తర్వాత టీకా ఇంజక్షన్‌తో కుడి భుజంలో ఇన్ఫెక్షన్ అయింది. తరుచూ రక్తం కారుతున్నదని, మెరుగైన చికిత్స కోసం ఇండియాకు పంపించాలని మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని చంద్రశేఖర్ తల్లి ఆవేదనవ్యక్తం చేసింది. చంద్రశేఖర్ ఉద్యోగానికి రాజీనామా చేసినట్టు తెలిపింది. ఢిల్లీలోని హెచ్‌ఆర్ ఇంటర్నేషనల్ రిక్రూటింగ్ ఏజెన్సీ ద్వారా చంద్రశేఖర్ సౌదీ వెళ్లాడని, తిరిగి రప్పించడంలో సహకరించాలని తల్లి లక్ష్మి వారిని కోరింది. అత్యవసరంగా ఇండియాకు వాపస్ తెప్పించాలని అతని తల్లి లక్ష్మి గురువారం హైదరాబాద్‌లోని విదేశాంగ శాఖ పీఓఈ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించింది. కొడుకు అనారోగ్యానికి కారకులైన హైదరాబాద్‌లోని మెడికల్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని కోరింది.